క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజంపేట రూరల్ : రాజంపేట, పుల్లంపేట, నందలూరు మండలాల పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ డీఈఈ ఎం.సురేంద్రనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. రాజంపేట, నందలూరు, పుల్లంపేట పట్టణాలతో పాటు తాళ్లపాక, బ్రాహ్మణపల్లి, ఆకేపాడు, హెచ్.చెర్లోపల్లి, కట్టకిందపల్లి, రెడ్డిపల్లి, దళవాయిపల్లి, పీవీజీ పల్లి, కొండపల్లి, మందరం, ఎన్‌టీ పల్లెల సబ్‌స్టేషన్‌లతో పాటు సబ్ స్టేషన్‌ల సమీపంలో చేపడుతున్న మరమ్మతుల కారణంగా విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలియజేశారు. విద్యుత్ వినియోగదారులు విద్యుత్‌శాఖకు సహకరించాలని కోరారు.

నేడు ఓబులేశ్వరుని తిరునాల

సుండుపల్లె : మండల పరిధిలోని తిమ్మసముద్రం గ్రామం బురుజుగారిరెడ్డివారిపల్లెలో వెలసిన ఓబులేశ్వరస్వామి తిరునాల మహోత్సవాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు ఆ గ్రామ ప్రజలు తెలిపారు. శనివారం ఉదయాన్నే స్వామి వారికి అభిషేకాలు, కుంకుమార్చనలతో ప్రత్యేక పూజలు నిర్వహించి రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విద్యుత్ దీపాలంకరణతో చాందినీబండ్లు ప్రదక్షిణలు చేస్తాయని వారు పేర్కొన్నారు.

నేటి నుంచి చిన్నగంగమ్మ జాతర

వీరబల్లి : మండలంలో గుర్రప్పగారిపల్లి పంచాయతీలో గుర్రప్పగారిపల్లి దగ్గర వెలసిన పురాతన దేవాలయమైన చిన్న గంగమ్మ తిరునాల శని, ఆదివారాలు జరుగునని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయన్నారు. అదేరోజు రాత్రి అమ్మవారికి మొక్కుబడులు ఉన్న భక్తులు చాందినీ బండ్లు కట్టి మొక్కుబడులు తీర్చుకుంటారని తెలియజేశారు. జాతరలో కోలాటాలు, చెక్కభజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని వారు చెప్పారు. ఆదివారం తెల్లవారుజామున తొగటపల్లి నుంచి చౌడేశ్వరమ్మ ఊరేగింపుతో అమ్మవారి ఆలయం వద్ద చేరుకుంటుందని, అనంతరం అమ్మవారికి పూజలు జరుగుతాయన్నారు. అమ్మవారికి బోనాలు సమర్పించడం జరుగుతుందన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



గర్భిణీ స్త్రీలకు భోజనం వడ్డిస్తున్న ఎంపీపీ

వీరబల్లి : వీరబల్లి మండలంలోని గర్భిణీ స్త్రీలకు మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక చికిత్సలను అందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం డాక్టర్ మనీషా ఆధ్వర్యంలో ప్రత్యేక చికిత్సలతోపాటు వైద్య పరీక్షలు నిర్వహించారు. వారికి ఆరోగ్యం పట్ల సూచనలు, సలహాలు ఇవ్వడమే కాకుండా మందులు, మాత్రలు పంపిణీ చేశారు. అనంతరం ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో గర్భిణులకు భోజన సౌకర్యం కల్పించి స్వయంగా వడ్డించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

రాజంపేట రూరల్ : నూతన వధూవరులను వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి ఆశీర్వదించారు. మండల పరిధిలోని ఆకేపాడు అచ్చనపల్లి, సుండువారిపల్లి గ్రామాలను ఎమ్మెల్యే ఆకేపాటి శుక్రవారం సందర్శించారు. ఆకేపాడు అచ్చనపల్లెలోని గోపుగారి వెంకటరెడ్డి కుమారుడు వెంకటరెడ్డి, కోడలు లక్ష్మీలను అదే విధంగా సుండువారిపల్లికి చెందిన దియ్యాల సుబ్బరాయుడు కుమార్తె రెడ్డిప్రసన్న, అల్లుడు దేవభార్గవ్‌ను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.

మురళీ నాయక్ మరణం బాధాకరం



కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్ : పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో వీరమరణం పొందిన మురళీ నాయక్ దేశ చరిత్రలో నిలిచిపోతారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. పదునాలుగు మంది పాక్ సైనికులను చంపి దేశ భద్రతలో తన ప్రాణాలను పణ్ణంగా పెట్టిన మురళీ నాయక్ వీరమరణం పొందడం దురదృష్టమన్నారు. భారతదేశ భద్రత కోసం ప్రాణత్యాగాలు చేస్తున్న ప్రతి సైనికుడిని గౌరవించడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. అలాగే వీరమరణం పొందిన మురళీ నాయక్ కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

బ్రహ్మోత్సవం.. ఆనందోత్సవం

- నేటి నుంచి 14 వరకు భువనగిరి కొండపై లక్ష్మీనరసింహుని బ్రహ్మోత్సవాలు
- 13న అంగరంగ వైభవంగా కల్యాణోత్సవం



లక్ష్మీ నృసింహస్వామి ఆలయం వ్యూ (ఇన్‌సెట్‌లో) స్వామి వారి మూలవిరాట్టు

రాజంపేట రూరల్ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని ప్రముఖ పుణ్య క్షేత్రమైన శ్రీ భువనగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను 10వ తేదీ శనివారం నుంచి అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ ధర్మకర్తలు ఏర్పాట్లు పూర్తి చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా స్వామివారి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించడం వల్ల జిల్లా వ్యాప్తంగా ఉన్న స్వామివారి భక్తులు, మహిళలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొంటారు. ఐదు రోజుల పాటు వైభవంగా నిర్వహించే ఈ బ్రహ్మోత్సవాలలో 13వ తేదీన జరిగే కల్యాణం విశిష్టమైనది. జిల్లాలో ప్రభుత్వం తరఫున ముత్యాల తలంబ్రాలు అందజేసే ఏకైక నరసింహ స్వామి ఆలయంగా కీర్తించబడుతోంది. ప్రతి సంవత్సరం స్వామివారికి భువనగిరిపల్లెలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయం నుంచి కొండమీదికి మేళతాళాలతో, బాజా భజంత్రీలతో ముఖ్య అతిథులుగా విచ్చేసిన ప్రముఖులు ముత్యాల తలంబ్రాలను తీసుకువచ్చి అందజేయడం పరిపాటి.

నరసింహస్వామి ఆలయ చరిత్ర..

గత 317 సంవత్సరాల క్రితంలో భువనగిరిపల్లి వద్ద నున్న కొండపై ఒక వేపచెట్టు కింద శ్రీ అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీ మహావిష్ణువు పాదాలు ఉండేవి. వాటిని అక్కడికి వచ్చి గమనించిన ఒక సాధువు ప్రతిరోజు అక్కడే వుండి పూజలు నిర్వహిస్తూ ఉండేవాడు. కొండ కిందగల భువనగిరిపల్లి ప్రజలు గోవులను మేపుకునేందుకు కొండపైకి వెళ్లగా అక్కడ పూజలు చేసే సాధువు వారిని పిలిచి ఇక్కడ సాక్షాత్తు శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి పాద ముద్రలు ఉన్నాయని తెలిపేవాడు. ఇక్కడ పూజలు నిర్వహించే వారికి ఆయన కోరిన కోర్కెలు తీరుస్తారని సెలవిచ్చేవాడు. ఆ సాధువు పూజలు చేస్తూ క్రమేణా ఆదే పవిత్ర స్థలంలో శ్రీ లక్ష్మీనరసింహుని మూలవిరాట్‌ను ప్రతిష్ఠింపచేసి ఆలయాన్ని నిర్మింపచేశారు.

స్వామిని దర్శించుకున్న అన్నమయ్య..

పదకవితా పితామహుడైన శ్రీ తాళ్లపాక అన్నమాచార్యులు నారసింహుని పలుమార్లు దర్శించుకున్నట్లు తమ పెద్దలు చెప్పేవారని గ్రామంలోని పెద్దలు ఇప్పటికీ చెబుతుంటారు. అన్నమయ్య తన స్వగ్రామమైన తాళ్లపాక నుంచి అమ్మమ్మగారి ఊరు అయిన (ఉడుమూరు) ఊటుకూరికి వెళ్లినపుడు అక్కడే సమీపాన ఉన్న శ్రీ భువనగిరిపల్లి కొండపైకి వెళ్లి స్వామివారి పాదాలను దర్శించుకునేవారట. అదే విధంగా అక్కడ వున్న లక్ష్మీనరసింహస్వామిని కీర్తిస్తూ కొన్ని కీర్తనలు కూడా రాశారని పెద్దలు తెలుపుతున్నారు.

బ్రహ్మోత్సవ వివరాలు..

- ఈనెల 10వ తేదీన శనివారం గణపతిపూజతో స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. రాత్రి ధ్వజారోహణంపై స్వామివారు ప్రజలకు దర్శనమిస్తారు.
- నృసింహస్వామి జయంతి సందర్భంగా 11వ తేదీన ఆదివారం ఉదయం అభిషేకాలతోపాటు జయంతి వేడుకలు నిర్వహిస్తారు. రాత్రి స్వామివారికి హనుమద్ వాహన సేవ నిర్వహిస్తారు.
- 12న సోమవారం ఉదయం అభిషేకాలు నిర్వహిస్తారు. రాత్రి స్వామివారికి గరుడ సేవలో దర్శనమిస్తారు.
- 13న మంగళవారం ఉదయం 10:30గంటల నుంచి 12:30గంటల వరకు కల్యాణం నిర్వహిస్తారు. భక్తులకు కల్యాణం సందర్భంగా ఉచిత భోజనం ఏర్పాటు చేయనున్నారు. రాత్రి స్వామివారు గజవాహనంపై ప్రజలకు దర్శనమిస్తారు.
- 14న బుధవారం ఉదయం వసంతసేవ ఉత్సవం నిర్వహిస్తారు. అనంతరం రాత్రి ఏకాంతసేవ, ధ్వజావరోహణం నిర్వహించి బ్రహ్మోత్సవాలను ముగిస్తారు. ప్రతిరోజూ రాత్రివేళ సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు జరుగనున్నట్టు ఆలయకమిటీ సభ్యులు తెలియజేశారు.

తాళ్లపాకపై టీటీడీ చిన్నచూపు తగదు



మేడసానికి వినతిపత్రం అందజేస్తున్న పోతుగుంట

రాజంపేట టౌన్ : పదకవితా పితామహుడు అన్నమాచార్యుల జన్మస్థలమైన అభివృద్ధిపై టీటీడీ చిన్నచూపు చూడటం తగదని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు వై.సురేష్‌రాజు ఆవేదన వ్యక్తం చేశారు. అన్నమయ్య ప్రాజెక్టు స్పెషల్ ఆఫీసర్ మేడసాని మోహన్ రాజంపేటకు వచ్చిన సందర్భంగా అన్నమయ్య జన్మస్థలిని అభివృద్ధి చేసి, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని వారు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. అన్నమాచార్యుల 599, 600 జయంతి ఉత్సవాలను పెద్దఎత్తున నిర్వహించారని, ఆ తరువాత అన్నమయ్య ఉత్సవాలను గాలికి వదిలేశారని ఆరోపించారు. అన్నమయ్య ధ్యానమందిరం పేరిట మ్యూజియం ఏర్పాటు కలగానే మిగిలి పోతోందన్నారు. తాళ్లపాకలో పాఠశాలను టీటీడీ దత్తత తీసుకున్నప్పటికీ అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టలేదని ఆరోపించారు. అన్నమాచార్య ధ్యానమందిరం శిథిలావస్థకు చేరుకుందని, అందువల్ల సింహాచలం అప్పన్న ఆలయంలో జరిగిన దుర్ఘటన వంటిది జరగకముందే కొత్త ధ్యానమందిరాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రతి రోజు తాళ్లపాక ధ్యానమందిరంలో, అన్నమయ్య 108 అడుగుల విగ్రహం వద్ద అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు సంగీత సభ, హరికథ నిర్వహించే కళాకారులకు కనీసం మైక్ కూడా కల్పించకపోవడం దారుణమైన విషయమన్నారు. 108 అడుగుల విగ్రహం వద్ద వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించి ఏడాది పూర్తయినా ఇంతవరకు టీటీడీ ప్రారంభించకపోవడం అన్నమయ్య జన్మస్థలిపై ఏపాటి శ్రద్ధ ఉందో ఇట్టే అర్థం అవుతోందన్నారు. తాళ్లపాకలో విరిగిపోయిన రథానికి మరమ్మతులు చేపట్టకపోవడంతో రథం మూలకు చేరిందని, వెంటనే రథానికి మరమ్మతుత్తులు చేయించాలని డిమాండ్ చేశారు. ఇదిలావుంటే బీజేపీ నాయకులు వినతిపత్రం ద్వారా తెలియచేసిన సమస్యలపై అన్నమాచార్య ప్రాజెక్టు స్పెషల్ ఆఫీసర్ మేడసాని మోహన్ సానుకూలంగా స్పందించారు.

కాంట్రాక్టర్‌కు కాసులు కురిపించేలా ఏపీఎండీసీ వైఖరి

- ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది సమస్యలు పట్టని అధికారులు



ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

ఓబులవారిపల్లె : ఏపీఎండీసీ ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఉద్యోగులకు జీతాలు పెంచాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య పేర్కొన్నారు. శుక్రవారం మంగంపేట ఏపీఎండీసీ ఆరోగ్య కేంద్రాన్ని సీపీఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా గుజ్జల ఈశ్వరయ్య మాట్లాడుతూ ఏపీఎండీసీ యాజమాన్యం ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఉన్నతమైన ఆశయాలను నీరు కారుస్తూ కాంట్రాక్టర్లకు కాసులు కురిపించే విధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. అధికార పార్టీ నాయకులకు సంబంధించిన వారికి కాంట్రాక్ట్ ఇప్పించి కాసులు కురిపిస్తున్నారని విమర్శించారు. పనిచేస్తున్న కార్మికులకు జీత భత్యాల విషయంలో కార్మిక చట్టాలను, హక్కులను ఉల్లంఘించి ఆరోగ్య కేంద్రాన్ని నడిపిస్తున్నారని అన్నారు. ఆరోగ్య కేంద్రంలో కాంట్రాక్ట్ వ్యవస్థ పూర్తిగా విఫలమైందని, ఇప్పటికైనా ఏపీఎండీసీ ఆరోగ్య కేంద్రం పాలకులను కాంట్రాక్టు నుంచి విముక్తి చేసి ఏపీఎండీసీ యాజమాన్యమే నిర్వహణా బాధ్యతలు చేపట్టాలన్నారు. అలాగే కార్మికులకు జీతభత్యాలు పెంచడమే కాకుండా వారికి అర్హతను బట్టి ప్రమోషన్లు కల్పించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పండుగోల మణి, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎ గంగాధర్, రైల్వేకోడూరు నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, మండల కార్యదర్శి చింతలపూడి నాగమ్మ, బీకేఎంయూ రైల్వేకోడూరు ఏరియా కార్యదర్శి, రైతు సంఘాల నాయకులు తిప్పన ప్రసాద్, ఎం.శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక శిక్షణా తరగతులను జయప్రదం చేయండి

రైల్వేకోడూరు అర్బన్ : మే నెల 17వ తేదీ నుంచి 26వ తేదీ వరకు జరిగే ఎస్ఎఫ్ఐ రాష్ట్ర వైజ్ఞానిక శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని జిల్లా ఉపాధ్యక్షులు మదన్‌మోహన్ రెడ్డి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరు పట్టణంలో ఈనెల 17వ తేదీ నుంచి జరిగే ఎస్ఎఫ్ఐ వైజ్ఞానిక శిబిరాలలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మారెమ్మ ఆలయ అభివృద్ధికి కృషి

నందలూరు : నాగిరెడ్డిపల్లె గ్రామదేవత శ్రీ మారెమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి తమవంతుగా కృషిచేస్తామని అరిగె సోదరులు అరిగె హరిబాబు(మీసేవ కేంద్రం), అరిగె మణి(రాయల్ మెడికల్ హాల్)లు శుక్రవారం ఇక్కడి విలేకర్లకు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.1.10,000ల విలువ చేసే గ్రానైట్ బండలను విరాళంగా అమ్మవారి ఆలయానికి అందచేశామన్నారు. అంతకముందు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. గ్రానైట్ బండలను ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు. పనులకు పూజలు చేసి ప్రారంభించారు.

నిత్యాన్నదానానికి విరాళం

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదానం కోసం రాయచోటి మాజీ ఎమ్మెల్యే మండిపల్లి నారాయణ రెడ్డి కుమారుడు మండిపల్లి రాహుల్‌రెడ్డి దంపతులు విరాళాన్ని ఆలయ ఈఓ డివి రమణారెడ్డికి అందజేశారు. శుక్రవారం రాహుల్‌రెడ్డితో పాటు ఆయన భార్య మైత్రేయి ఆలయానికి వచ్చారు. వీరు స్వామి వారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నిత్యాన్నదానం కోసం రూ.1.11.116ల విలువ చేసే చెక్కును అందజేశారు.

బ్రహ్మోత్సవాలకు ముస్తాబు

సిద్దవటం : మండల శివారులోని జేఎంజే కళాశాలకు ఎదురుగా వెలసిన శ్రీ పెంచల లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి 12వ తేదీ సోమవారం వరకు జరుగునని ఆలయ సహాయ కార్యదర్శి పాలెం నరసింహ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన సిద్దవటంలో మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం విశేష పూజలు జరుగుతాయన్నారు. 11వ తేదీ ఆదివారం హోమాలు, అభిషేకాలు, తీర్థ ప్రసాదాల వినియోగం జరుగుతాయన్నారు. రాత్రి చెక్కభజనలు ఉంటాయన్నారు. 12వ తేదీ సోమవారం తెల్లవారుజామున గరుడ సేవ, సుదర్శన హోమం, అనంతరం లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణ మహోత్సవం, పూర్ణాహుతి వంటి పూజలు జరుగునన్నారు. రాత్రి స్వామి వారికి పవళింపు సేవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

నిర్లక్ష్యం వీడరు.. నిబంధనలు పాటించరు

- మధ్యాహ్నం 3:30కే ఖాళీగా రెవెన్యూ కార్యాలయం
- జిల్లా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలంటూ ప్రజల డిమాండ్



అధికారులు లేకపోవడంతో ప్రజలు లేక వెలవెలబోయిన రెవెన్యూ కార్యాలయ ప్రాంగణం

ఒంటిమిట్ట : సమయపాలన అనే పదం ఒంటిమిట్ట మండల రెవెన్యూ కార్యాలయానికి వర్తించదా అని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది విధుల పట్ల సమయం పాటించడం లేదని పలుమార్లు పత్రికల్లో కథనాలు ప్రచురించినా వారి నిర్లక్ష్య ధోరణి వీడటం లేదు. సిబ్బంది అలసత్వం పట్ల జిల్లా ఉన్నతస్థాయి అధికారులు చర్యలు చేపట్టకపోతే తీరు మారదని ప్రజలు తెలియజేస్తున్నారు. సమయపాలన అనే పదం ఒంటిమిట్ట రెవెన్యూ కార్యాలయ సిబ్బందికి అసలు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 3:30 గంటలకే కార్యాలయం ఖాళీగా దర్శనమిచ్చింది. కేవలం సీనియర్ అసిస్టెంట్ సుబ్బయ్య మాత్రమే కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. విధుల పట్ల సిబ్బంది తీరుపై వార్తలు ప్రచురితమైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడంతోనే సిబ్బంది నిర్లక్ష్య వైఖరిలో మార్పు రావడం లేదని శుక్రవారం కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా ప్రస్తుతం ఎస్సీ కార్పొరేషన్ లోన్‌ల కోసం, రైస్ కార్డుల కోసం, క్యాస్ట్, ఆదాయ, జనన, మ్యారేజ్ సర్టిఫికెట్ల కోసం మండల ప్రజలు రెవెన్యూ కార్యాలయానికి ఎగబడుతుండగా ఈ సమయంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది సమయం పాటించకపోవడంతో ధృవపత్రాల కోసం వచ్చిన ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేసి నిరుత్సాహంగా వెనుతిరిగారు. ఇకనైనా రెవెన్యూ కార్యాలయ సిబ్బంది వ్యవహారంపై జిల్లా కలెక్టర్ దృష్టి సారించి విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మండల రెవెన్యూ అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మత సామరస్యానికి ప్రతీక జెండామాను మహోత్సవం



ఉత్సవంలో పాల్గొని పూజలు చేస్తున్న శ్రీకాంత్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లి : మత సామరస్యానికి ప్రతీక జెండామాను మహోత్సవమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం లక్కిరెడ్డిపల్లి మండలం దిన్నెపాడు గ్రామం దూదేకులపల్లిలో వైభవంగా జరుగుతున్న జెండామాను మహోత్సవంలో వారు పాల్గొన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన శ్రీకాంత్ రెడ్డికి గ్రామస్తులు ఆత్మీయ స్వాగతం పలికి ఆయనతో ప్రత్యేక పూజలు నిర్వహింపచేసి ప్రసాదాలు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ భగవంతుడు దయతో వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు, ప్రజలు సుభిక్షంగా, సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చిన్నబాషా, రఫీ, మహ్మద్ రఫీ, వలీ, అమీర్, అల్లా బక్ష్, రియాజ్, పబ్బా తదితరులు పాల్గొన్నారు.

దేశ సైనికులకు మద్దతుగా నేడు ర్యాలీ

నందలూరు : మన భారతదేశం ఆపరేషన్ సింధూర్ మొదలు పెట్టిన సందర్భంగా మన దేశానికి, సైనికులకి మద్దతుగా శనివారం సాయంత్రం 4:30 గంటలకు అరవపల్లి కృష్ణ మందిరం నుంచి అంబేడ్కర్ సర్కిల్ బస్టాండ్ వరకు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించనున్నట్లు నాగిరెడ్డిపల్లె సర్పంచ్ జంబు సూర్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం అరవపల్లెలోని శ్రీకృష్ణ గీతా మందిరంలో సమావేశం నిర్వహించారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మన దేశానికి, సైనికులకు మద్దతుగా ర్యాలీలో పాల్గొని సంఘీభావం తెలపాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ కార్యదర్శి సయ్యద్ అమీర్, అమ్మవారిశాల ఆలయ అధ్యక్షులు ఎంబలూరు నరసింహ, మోడపోతుల రాము, ముమ్మడిశెట్టి రమేష్, ఉప్పుశెట్టి సుధీర్, గంధం గంగాధర్, నారపు శెట్టి శివయ్య, సురేష్, సుబ్బ నరసయ్య, గురువిగారి వాసు, కొట్టే శ్రీహరి, ఆదినారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు బూసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, కాకి చంద్ర, నందలూరు ఉప సర్పంచ్ ఇబ్బు తదితరులు పాల్గొన్నారు.

యుద్ధవీరుడు మురళీ నాయక్‌కు జోహార్లు



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాసంఘాలు

రాయచోటి జగదాంబ సెంటర్ : పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో భారత ముద్దుబిడ్డ మురళీ నాయక్‌కు ప్రజా సంఘాలు జోహార్లు అర్పించారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వివిధ పార్టీల నాయకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి నేతాజీ కూడలి వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి యుద్ధవీరుడు మురళీ నాయక్‌కు నివాళులు అర్పించారు. శుక్రవారం తెల్లవారుజామున సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కళ్లితండాకు చెందిన మురళీ నాయక్ భారతదేశ సైనికుడిగా జమ్మూకశ్మీర్‌లో పాకిస్తాన్ సైనికులతో వీరోచితంగా పోరాడి వీరమరణం పొందారని ఆయన మరణం మమ్మల్ని బాధించిన దేశం కోసం గిరిజన బిడ్డగా వీర మరణం పొందడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో పల్లం తాతయ్య, బుక్కే విశ్వనాథ నాయక్, రామ్మోహన్ రెడ్డి, రామా శ్రీనివాస్, సాజిద్, శంకర్ నాయక్, ప్రసాద్ నాయక్, నాగేందర్, రిటైర్డ్ సీఐ బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తులు చేసుకోండి

పెనగలూరు : మండలంలో కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని తహసీల్దార్ అమరేశ్వరీ అన్నారు. కొత్తరేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకునేవారు రూ. 1.20 లక్షలు లోపు ఆదాయం కలిగి ఉండాలని ఆమె తెలిపారు. వివాహం అయిన దంపతులు పిల్లలతో సహా రేషన్ కార్డు నుంచి విడిపోయి కొత్త రేషన్ కార్డు కావాలనుకునేవారు వివాహ ధృవీకరణ పత్రం, వివాహంలో తీసిన ఫోటోలను తప్పనిసరిగా జత చేయాలన్నారు. పిల్లలను రేషన్ కార్డులో ఎక్కించాలన్నా జనన ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డు, రైస్ కార్డు, యజమాని ఆధార్ కార్డు ఉండాలన్నారు. రేషన్ కార్డులో నుంచి వ్యక్తిని తొలగించినప్పుడు అవసరమైన ధృవీకరణపత్రం, వ్యక్తిగత ఆధార్ కార్డు జత చేయాలన్నారు. రేషన్ కార్డులో అడ్రస్ మార్పు చేసుకోవాలంటే ముందుగా ఆధార్ కార్డులో అడ్రస్ మార్పు చేసి ఉండాలని ఆమె తెలిపారు. సచివాలయాల్లో దరఖాస్తులు అందజేయాలన్నారు.

కిశోరి వికాసమే సమాజ వికాసం



గాలివీడు: మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణకుమారి



లక్కిరెడ్డిపల్లె: పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న ఐసీడీఎస్ అధికారులు



సిద్దవటం: వీడియో ద్వారా అవగాహన కల్పిస్తున్న సచివాలయ పోలీసు సాయి దివిజ

గాలివీడు/లక్కిరెడ్డిపల్లె/సిద్దవటం : కిశోరి బాలికల వికాసమే సమాజ వికాసమని ఐసీడీఎస్ అధికారులు పేర్కొన్నారు. శుక్రవారం ఆయా మండలాల్లోని గ్రామాల్లో అధికారులు అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోరి వికాసంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ అధికారులు మాట్లాడుతూ బాల్య వివాహాల వలన కలిగే దుష్ప్రభావాలపై పలు సూచనలు చేశారు. ప్రస్తుత సమాజంలో కిశోరి బాలికల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలు ప్రోత్సహించే వారిపైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అలానే కిశోరి బాలికల్లో వ్యక్తిగత ప్రాముఖ్యతను తెలియజేశారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి సీడీపీఓ పద్మావతి, గాలివీడు సీడీపీఓ వై.అరుణకుమారి, సిద్దవటం సచివాలయ పోలీసు సాయి దివిజలతో పాటు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, కిశోరి బాలికలు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్య పరిరక్షణ

చిన్నమండెం : ప్రకృతి వ్యవసాయంతో సమతుల్య ఆహారంతో ఆరోగ్య పరిరక్షణకు ముందడుగు పడనున్నట్లు ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకటమోహన్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని కేశాపురం గ్రామం హరిజనవాడలోని అంగన్వాడీ సెంటర్‌లో ప్రకృతి వ్యవసాయం, ఆరోగ్య పోషకానికి ఉన్న సంబంధం, వాతావరణ మార్పులపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయంలో రసాయన ఎరువులు అధికంగా వాడటం వలన మానవులకు అనేక రకాల ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని వ్యవసాయ అధికారి శ్రీకర్ అన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో డ్వాక్రా మహిళలు, యానిమేటర్లకు వారు ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా ఎంటీ శ్రీనివాసులు లబ్ధిదారులకు ప్రకృతి వ్యవసాయం ప్రాముఖ్యతను వివరించారు. రసాయన మందులు లేకుండా ప్రకృతి వనరులతో పంటల సాగు పద్ధతిని వివరించారు. ఐసీఆర్‌పీ సుధారాణి ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో పండించిన ధాన్యాల, ఆకుకూరల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు.

పుల్లంపేట: వ్యవసాయంలో రసాయన ఎరువులు అధికంగా వాడటం వలన మానవులకు అనేక రకాల ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని వ్యవసాయ అధికారి శ్రీకర్ అన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో డ్వాక్రా మహిళలు, యానిమేటర్లకు వారు ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకతను వివరించారు.

నేడు వీరాంజనేయుని తిరునాల

సంబేపల్లె : మండల పరిధిలోని శెట్టిపల్లె పంచాయతీ నరసారెడ్డిగారిపల్లె సమీపంలోని పాలబండ సమీపంలో కొలువైన శ్రీ వీరాంజనేయస్వామి తిరునాలను నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ముందుగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. శనివారం ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు జరుపనున్నట్లు పేర్కొన్నారు. తిరునాలలో మండల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి దీవెనలు పొందాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు.

'సాక్షి' సంపాదకునిపై దాడి అప్రజాస్వామికం

- ప్రజలకు మంచి చేయలేకనే దుశ్చర్యలు
- పోలీసులను అడ్డుపెట్టుకుని నియంతృత్వ పోకడలు
- చంద్రబాబు పాలనపై మండిపడ్డ వైఎస్సార్‌సీపీ నేత పాపిరెడ్డి



మాట్లాడుతున్న పాపిరెడ్డి విశ్వనాథ్‌రెడ్డి

రాజంపేట టౌన్ : ఆడలేక మద్దలరేవు అన్నచందంగా చంద్రబాబుకు పాలన సాగించడం చేతకాక ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతీకలైన పాత్రికేయ సంపాదకులపై కూడా కక్షసాధింపు చర్యలకు దిగడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టులాంటిదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పాపిరెడ్డి విశ్వనాథ్‌రెడ్డి దుయ్యబట్టారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పాపిరెడ్డి శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. తెలుగు పత్రికా ప్రపంచంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకొని, ప్రజల గొంతుకగా ఉంటున్న ×సాక్షి° దినపత్రిక ఎడిటర్ రక్కాసి ధనుంజయరెడ్డిని చంద్రబాబు పోలీసులను అడ్డుపెట్టుకొని ఇబ్బందులు పెడుతుండటం అత్యంత దుర్మార్గమన్నారు. ఎలాంటి సెర్చ్ వారెంటు లేకుండా ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంటిలో సోదాలు చేయించడం బాబు దుర్మార్గమైన ఆలోచనలకు నిదర్శనమన్నారు. ×సాక్షి° ఎల్లో పత్రికల లాగా అసత్య వార్తలతో డబ్బా కొట్టకుండా ప్రజల పక్షాన నిలిచి వారి గొంతుకగా ప్రచురిస్తున్న కథనాలు బాబుకు మింగుడు పడటం లేదన్నారు. అయితే సాక్షి సంపాదకులను, పాత్రికేయులను ఎన్ని ఇబ్బందులు పెట్టినా ×సాక్షి° ఎప్పుడు ప్రజలపక్షానే ఉంటుందన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని ప్రజాగొంతుకగా పనిచేస్తున్న ×సాక్షి° పాత్రికేయులను బాబు భయపెట్టాలనుకోవడం అరచేతిని అడ్డుపెట్టి సూర్యప్రతిబింభాన్ని ఆపడమేనని తెలిపారు. ఒకవైపు దేశంలో యుద్ధ వాతావరణం నెలకొని మనదేశ సైనికులు ప్రాణాలకు తెగించి పాకిస్తాన్‌పై వీరోచితంగా పోరాడుతుంటే, చంద్రబాబు మాత్రం లేని లిక్కర్ స్కాంను సృష్టించి అబద్ధాలను ఆరోపణలుగా మార్చి దానిచుట్టూ దుర్మార్గమైన కార్యక్రమాలు చేపట్టేందుకు పోరాడుతున్నాడని ఎద్దేవా చేశారు. దేశంలో నెలకొన్న పరిస్థితులలో అయినా బాబు తన బుద్ధిని మార్చుకోలేదని ఆయన తీవ్రంగా విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అయినా ఏ ఒక్క వర్గానికి బాబు మంచి చేయకపోవడంతో ప్రజల్లో రోజురోజుకు వ్యతిరేకత తీవ్రతరం అవుతోందని, ప్రజా వ్యతిరేకతను పక్కదోవ పట్టించేందుకు చంద్రబాబు వైఎస్సార్‌సీపీ నాయకులపైనే కాక పాత్రికేయులకు కూడా రాజకీయ రంగుపులిమి ఇబ్బందులు పెడుతున్నాడని దుయ్యబట్టారు. గతంలో సీఎం కార్యదర్శిగా పనిచేసిన ఒక ఐఏఎస్ అధికారిపై, ఓఎస్డీగా పనిచేసిన నిజాయితీపరుడైన మాజీ ప్రభుత్వ ఉద్యోగిపై చంద్రబాబు తన అధికార బలాన్ని, బలగాన్ని ఉపయోగించి ఇబ్బందులు పెడుతుండటం బాబు కక్షపూరిత రాజకీయాలకు అద్దం పడుతోందని విమర్శించారు. కక్షలు తీర్చుకోవడం చంద్రబాబు అన్ని గీతలు దాటుతున్నాడన్నారు. అయితే ప్రజలకు నిజాలు ఈరోజు తెలియక పోయినా రానున్న రోజుల్లో తెలుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు గోపి, వివిధ విభాగాల కన్వీనర్లు జీవీ సుబ్బరాజు, కల్యాణ్‌కుమార్‌రెడ్డి, గోవిందు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.